# ★ కిటికీ ★

(కథానిక)

ఎప్పుడో పదేళ్ళనాడు గతించిపోయిన స్కూలు జీవితం నాకంత జ్ఞప్తిలో లేదు. ఏమాత్రమైనా స్కూలు వాతావరణం జ్ఞప్తికి వున్నదంటే ఆ చిన్ననాటి సుశీల వల్లనే. ఆమె యీవూరు రాకపోతే ఏమయ్యేదో! నా జీవితం ఎంత ప్రశాంతంగా నడిచేదో!

సుశీల మా యింటిపక్కనే నివసించేది. ఆమె తండ్రి గవర్నమెంటు ఉద్యోగి. వాళ్ళీవూరు కొత్తగా బదిలీఅయితే వొచ్చారట! ప్రతిరోజూ నేను యింటికి వొచ్చేటప్పుడు ఆ అమ్మాయి నా వెనకాలే నడిచివొచ్చేది. అందరూ నవ్వుకుంటూ ఉండేవాళ్లు. నాకు తగని సిగ్గయ్యేది. కాని ఏంచేశేది? మొగవాడైతే ఏమైతే అయిందని చెంపమీద వొక్కటి వేసేవాణ్ణి. కాని ఆడపిల్ల. ఏంచెయ్యడం?

ఒకరోజున రోడ్డుమీద మా స్నేహితుల అల్లరిభరించలేక నేనన్నాను: "ఏయ్! అమ్మాయ్! రోజూ నావెనకాలే తోకలాగ వస్తావెందుకూ? దూరంగా రాకూడదూ!" దీనికి మరునాడు నేను స్కూలు కాంపౌండుదాటి బైటికి వొచ్చేటప్పటికి పిడుగులాంటి గుద్దు ఒకటి వీపుమీద పడింది. వెనక్కు తిరిగి చూసేటప్పటికి నిన్న నేనన్న మాటలకి సుశీలకెంత రోషం వొచ్చిందో అర్థమైంది.

మాచుట్టూ పిల్లలు మూగారు. ఈ కోలాహలం చూసేసరికి "ఏమిట్రా అబ్బాయిలూ!" అనుకుంటూ మా లెఖ్ఖలమాష్టారు అక్కడికి వొచ్చారు. నా పక్కనున్నవాడు "మరేనండి; సుశీలే కిట్టుగాణ్ని వీపుమీద కొట్టిందండి!" అని చెప్పాడు.

మాస్టరుగారు మందహాసంచేసి "మంచి పని చేసింది. నిజమేనట్రా కిట్టూ!" అన్నాడు. నేను బిక్కమొహంతో నిజమేనండీ అని యీ నాలుగురోజుల్నించీ ఆమె నావెనకాల ఆమె ఎట్లా నడిచివచ్చిందీ, నాకెంత అవమానం వేసిందీ ఉన్నదున్నట్లు చెప్పాను. దీంతర్వాత ఆమె నన్నెన్నిసార్లు కొట్టిందో లెఖ్ఖలేదు. ఎక్కడ కనిపిస్తే అక్కడ ఒక్కటి కొట్టి పారిపోయేది. నేనేంచేసేది. స్థూలకాయుణ్ణి. వెంట పరిగెత్తలేను. పిల్లలందరూ నన్నెగతాళి చెయ్యడం మొదలుపెట్టారు

ఇల్లా చాలారోజులు గడిచిపోయినయ్. దీనికి ప్రతిక్రియ ఏమిటో నాకు తోచలేదు. ఏ పని చేస్తున్నా సుశీల ఆకారం నా కళ్లెదుటే వుండేది. రాత్రిళ్లు కలవరించేవాణ్ణిట కూడా. ఇహ నాకు విసుగేసి రేపుగనక మళ్లా సుశీల కొట్టడం సంభవిస్తే రోడ్డుమీదే తిరగబడి కొట్టి నాప్రజ్ఞ చూపటానికి నిశ్చయించుకున్నాను. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. బైట వెన్నెల కాస్తున్నది. నేను డాబామీద నెపోలియన్ చక్రవర్తివలె పచారుచేస్తూ యీ అల్లరిపిల్లకు తగినమందు ఏమిటా అని ఆలోచించసాగాను. రాత్రి పన్నెండు కావొస్తున్నది. పక్కనున్న సుశీలయిల్లు చెట్లనీడల్లో జోగుతూ నిద్రిస్తున్నది. మా యింటికీ పక్కయింటికీ మధ్యనున్న రోడ్డుమీద కుక్కలు మొరిగి నిద్రపోయినాయి. నేను పిట్టగోడమీంచి పాతాత్తుగా ఆమె యింటికేసి చూసి నిశ్చేష్టుణ్నైయాను. ఇందాకట్నించీ నేను గమనించలేదు. ఇటు రోడ్డుమీదికి వున్న కిటికీ తలుపులు తెరిచివున్నాయి. ఆపెద్దకిటికీ చువ్వల మధ్య తన చిన్న తలకాయ నిరికించి సుశీల— నేన్నెన్నో దెబ్బలుకొట్టిన సుశీల: - ఆ వెన్నెల్లో యిందాకట్నించీ నావేపే చూస్తున్నది.

ఆరోజు రాత్రి నిద్రబట్టలేదు దీని ఉద్దేశ్యం ఏమైవుంటుంది? తనలా నన్నన్నిసార్లు కొట్టినందుకు చాలా విచారపడుతున్నానని చెప్పడమా అది? అయితే తొందరపడి సుశీలని నేను తిట్టకూడదు. ఇది వొక వెక్కిరింపా? అహా! ఆ

గోవిందరాజు సుందరరావు

మొహమల్లా లేదు. అతిదీనంగా వున్నది. అది యింకేం కాదు. పశ్చాత్తాపమే. అల్లా అయితే యీ పిల్లను క్షమించవచ్చును. నేనామెకు యివ్వదల్చిన శిక్షను తగ్గించటంగానీ లేక రద్దుగానీ చేయవచ్చును. అందుకామె కిటికీ చువ్వల్లోంచి చూసిన చూపే కారణం. ఆ చూపుతో యీ మా వైరం ఒక స్నేహంలాగ, బాంధవ్యంలాగ, ఓ దగ్గిరి సంబంధంలాగ పరిణమించింది. దానికి నేనెంతో సంతోషించాను. ఆ మిగిలిన రాత్రి నేనెంత సుఖంగా నిద్రించానో యీ నాటికీ నాకు జ్ఞాపకం వున్నది.

మర్నాడు స్కూలు విడిచాక నా వెనకాలే నడచి వస్తున్న సుశీలను దగ్గిరా రమ్మని సంజ్ఞ చేశాను. ఆమె వచ్చింది. నిర్భయంగా నాకేసి చూసింది. నే నన్నాను: "చూడు సుశీలా! నన్నన్ని దెబ్బలు కొట్టావే. మాష్టర్ల ముందు, నౌకర్ల ముందూ, రోడ్డు మీదా, అది తప్పు గాదూ?"

"ఇక మీదట కొట్టను లే కిట్టూ!" అన్నది సుశీల.

"కానీ సుశీలా! నన్ను కొట్టిన దెబ్బలకి ఏ నాటికైనా దేవుడు నిన్ను దండిస్తాడు!"

"లేదు కిట్టూ! అంతగా కోపమొస్తే నన్ను కొట్టి కసితీర్చుకో!"

దీనికి నాలో ప్రచండమైన అవమానం బయల్దేరింది.

"ఒకవేళ నిన్ని రోడ్డుమీద కొడితే ఏం చేస్తావే సుశీలా!" దానికి సుశీల నవ్వుతూ:

"అబ్బా! నువ్వు కొట్టవని నాకు తెల్సుగా!" అన్నది.

"ఎందుకు కొట్టను? నువ్వు తప్పు చెయ్యలా?"

"నేనేం తప్పు చేశాను? మరి మాస్టర్తో నేన్ని వెనకాల నడిచొస్తున్నానని ఎందుకు చెప్పాలి? నాకవమానం కాదూ?"

నేనాలోచించాను. నిజమే మరి! నాకవమానకరమైన విషయం సుశీలకి మాత్రం ఎందుకు అవమానకరంగాదో నేను గ్రహించలేదు. నేను నవ్వి ఆమె జబ్బ చరిచి "భేష్! సుశీలా! నువ్వు చాలా తెలివిగల పిల్లవి!" అన్నాను.

మా యిళ్లకొక ఫర్లాంగు దూరంలో ఒక చిన్న నది ప్రవహిస్తూ వుండేది. అది కృష్ణానది పాయ అని మా తాతయ్య చెప్పగా విన్నాను. స్టేషనులోంచి రైలుదిగి వచ్చినవాళ్లు యీ నదీతీరం మీంచే వూళ్లోకి వస్తారు. దాన్లో నీళ్లు తాగితే యిక జన్మ తరిస్తుంది. ఈ నదీతీరంలోనే అందరుపిల్లలూ ఆడుకుంటూండేవాళ్ళు. అక్కడే నేనూ సుశీలా వంటరిగా ఆడుకుంటుండేవాళ్లం. సుశీలతో పరిచయం కలిగాక నా పాత స్నేహితులందరినీ వదలివేసి వారి ఆగ్రహానికి పాత్రుడనైనాను. అయినా ఫర్వాలేదు. వాళ్ళందరూ నాకివ్వలేని స్నేహాన్నీ ప్రేమనీ సుశీలే నాకందించేది. మా యిద్దరికీ యిల్లు పట్టేది కాదు. ఒక్కొక్క రోజు స్కూలు ఎగ్గొట్టి పక్కనున్న పల్లెటూరికిపోయి అక్కడ తేగలు కొనుక్కుని తెచ్చేవాళ్లం. అప్పుడే నాకు తెలిసింది. సుశీల నాకులంది కాదనీ, కాపుల పిల్ల అనీ. ఆ రోజున ఆమె ఎంతో ఆశ్చర్యంగా అడిగింది:

"కిట్టూ! అయితే మీరు మాంసం వండుకుని తినరూ?"

అటువంటి ఆశ్చర్యం సుశీలకి యెప్పుడూ కలగలేదు.

"ఛ, ఛ! మేమెందుకు తింటాం? మేమెవరమో తెల్సునా? బ్రాహ్మలం!" నేను బ్రాహ్మణ్ణి అని తెలియగానే ఆమె నావేపు ఎగాదిగా పదిసార్లు చూసింది. ఆమె బ్రాహ్మణ పిల్ల కాదంటే నాకూ అంతే ఆశ్చర్యం కలిగింది. అంతే! కాని అప్పట్లో మా కులంలోని ప్రాధాన్యం మాకంతగా తెలియలేదు.

మేమిద్దరం కృష్ణానదీ తీరంలో యిసిక గూళ్లు ఎన్ని కట్టివుంటామో లెక్కలేదు. ఆ రోజుల్లో రాత్రిపూట పిచ్చికలు వచ్చి ఆ గూళ్లలో నివసిస్తూ వుండేవని మా నమ్మకం. కాని మర్నాడు మేమక్కడికి వెళ్లేప్పటికి అవి ఆనవాలు లేకుండా చితికివుండేవి. "పిచ్చికలు పారిపోయినాయి" అనేది సుశీల.

ఆమె నొకనాడు మా యింటికి రమ్మన్నాను. ఆమె అనుమానంగా నావేపు చూస్తూ.

"సరేగాని బావా! మీ వంటింట్లోకి మేం రాకూడదుట నిజమేనా?" అని అడిగింది.

ఆమె నన్ను 'బావా' అని పిలవొచ్చునా అనే సందేహం కలిగి ఆమెకు నన్నలా పిలవడం తప్పని నచ్చచెప్పాను.

"ఏం?" అన్నది సుశీల.

"మనిద్దరం ఒక కులంవాళ్ళం కాదుకదూ?" అన్నాను.

"అయితే నేం?"

"ఐతే ఏంలేదు. మానాన్న కోప్పడ్తాడు."

"అవును. మా అమ్మకూడా కోప్పడుతుంది. అయినా పిలిస్తేనేం బావా?"

నే నాలోచించి "సరే నీయిష్టం. అల్లానే పిలు–ఏంలేదు లే!" అన్నాను. కాని నే నేం అన్నానో అప్పుడు నాకే తెలియదు.

ఒకరోజు పూలు తెచ్చుకోడానికి మేం గార్డెనుకు బయల్దేరాం. గార్డెన్‌కి వెళ్ళాలంటే స్టేషన్‌దాటి ఒక ఫర్లాంగు వెళ్ళాలి. ఆ తోట మాలి చిన్నప్పట్నుంచీ నాకు తెలుసు. మే మిద్దరం ఎగుర్తూ పాడుతూ పోతూంటే మా బావా, అక్కయ్యా ఎదురుగా స్టేషన్నుంచి వస్తున్నారు. వాళ్ళిద్దరూ సంక్రాంతికి పక్క వూర్నుంచి మా యింటికివచ్చారు. ఇప్పుడు వాళ్ళిద్దర్నీ ఏదోవిధంగా తప్పించుకుంటే గాని వీల్లేదు. బావ మా లెక్కల మాష్టరుగారి దెబ్బకన్న బలమైంది వీపుమీదవేసి "ఏంరా కిట్టూ!... వెధవా! ఎక్కడికి యిలా పోతున్నావు? బాగా చదువుతున్నావా" అన్నాడు. అక్కయ్య "యింటికి పోదాంరా, ఎక్కడికి ప్రయాణం" అన్నది. నేను తల గోక్కుని "యిదిగో యీ అమ్మాయి వున్నదే, వాళ్ళమ్మకు జబ్బుగా ఉన్నది. ఐస్ తేవడానికి స్టేషనుకు పోతున్నాం!" అన్నాను. వాళ్ళని వదిలించుకోడానికి నేను బొంకిన బొంకుకి సుశీల నన్నెంతో మెచ్చుకుంది.

మేం నడుస్తూ కబుర్లతో స్టేషను దాటాం.

"బావా! వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాం కాదూ?" "అవును"

"అంటే పెళ్ళి చేసుకున్నారు గదూ?" "అవును"

"నువ్వు చూశావా పెళ్ళి!"

"చూట్టమా? బావముందు సాంబ్రాణీ వత్తులు వెలిగించింది నే నేగా!"

"మనంకూడా పెళ్ళి చేసుకోవచ్చా?"

నే నామెవేపు చూశాను. ఆమె పరికిణీ తెల్లగా ఆమె మనస్సులాగా కింపడున్న మట్టినంతా వూడ్చివేస్తున్నది.

"పెళ్ళి చేసుకోవచ్చును. కాని-" అని నే లెక్కించాను.

"మళ్ళీ అదేనా? నాన్న కోప్పడ్తాడు.కదూ?"

"ఛీ, ఛీ. నాన్నెందుకు కోప్పడ్తాడు!" అవును నాన్నెందుకు కోప్పడ్తాడు!"

"మరి?"

"చిన్నవాళ్ళంగా ఇప్పుడు! పెద్దయింతర్వాత చేసుకుందాం-ఏం?"

"నిజంగా? వొట్టెయ్యి."

నేను గట్టిగా వొట్టేశాను. ఆ దెబ్బకి ఆమె చేతి నున్నగాజులు పగిలి చేతిలోంచి రక్తం ప్రవహిస్తూవున్నది. వెంటనే నది దగ్గరకెళ్ళి కడిగి, చేతికి తడిగుడ్డచుట్టాను. "సుశీలా బాధగా వున్నదా?" అన్నాను-నేను.

"అవును బావా" అన్నది ఆమె. "అల్లా ఐతే యివ్వాళ పూలొద్దు. యింటికి వెళదాం రా" అన్నాను. వచ్చే దార్లో సుశీల బలహీనంగా నడుస్తూ "అయినా అంత ఘట్టిగా వొట్టువెయ్యడం దేనికి బావా!" అన్నది.

మళ్ళా మూడురోజుల తర్వాత సుశీల కనిపించింది. ఈ మూడురోజులూ ఆమె బడికి రాలేదు. రోజూ డాబామీంచి కిటికీ తలుపుల్లోంచి కనిపించే ఆమె సుందర వదనంకేసి చూస్తూ తృప్తిపడేవాణ్ణి. ఆమె నాతో అన్నది:

"నువ్వారోజున ఐస్ కొంటానికి స్టేషన్‌కి వెళ్తున్నాం అని యెందుకు చెప్పావు బావా! నిజంగా ఆరోజే మా అమ్మకు జబ్బుచేసింది!"

అబద్ధమాడినందుకు నే నెంతో విచారించాను. అందుకనే ఆమె యీ మూడురోజులూ బడికి రాలేదు.

"నిన్నరాత్రి కిటికీ తలుపులు తీసివున్నాయ్ కాదూ!" సంభాషణ మార్చి ఆమెను సంతోషపెడదా మనుకున్నాను.

"అవును."

"అందులోంచి నావేపు యెవరు చూశారు చెప్పుకో!"

"నేనే."

"ఛా. నువ్వుకాదు, ఎవరో దొంగ!"

"ఇంకెవరున్నారు? ఆ కిటికీ తలుపుల్లోంచి నీకోసం చూసేవాళ్ళు నాకంటే ఇంకెవరున్నారు బావా?" అని ఆమె దీనంగా అన్నది.

కాలం యిల్లా గడిచిపోతున్నది. కాని మా మనస్తత్వం ఏమాత్రం మారలేదు. ఇంతలో మా మాష్టరుగారు పరీక్షలొస్తున్నయ్యి అని జ్ఞప్తికి తెచ్చారు. దాంతో విద్యార్థినుడైన మాబావ. పొద్దున్నించీ సాయింకాలందాకా నా మాష్టరు. సుశీల ఏమయిందో తెలియదు. అది నా గొప్పతనం కానీండి మాబావగొప్పతనంకానీండి నాకా పరీక్షల్లో అన్నిట్లో ఫస్టుమార్కు లొచ్చినాయి. ఆరోజు సుశీల బళ్ళోకి రాలేదు. ఈమాట వింటే అది ఎంత ఆనందిస్తుంది? అందుకని బడి వదలగానే సరాసరి నదీతీరం వైపు పరుగెత్తాను. నా హృదయం ఆనందంతో పొంగుతున్నది. నా కింతవరకూ దేంట్లోనూ ఫస్టుమార్కు రాలేదు! యీమాటలు సుశీలతో చెప్పి ఆమె నావేపు గొప్పగా చూస్తుంటే "ఫర్వాలేదులే సుశీలా, ఈసారి నీక్కూడా వొస్తుంది" అని వోదారుద్దామని ఆశతో వున్నాను.

సుశీల అక్కడ విచారంగా కూచునివున్నది.

"ఏం?" అన్నాను నేను. నావేపు చూడంగానే ఆమె ఏడవటం మొదలు పెట్టింది. నా కాశ్చర్యం వేసింది. "అదేమిటి సుశీలా, ఎందుకూ ఏడుస్తున్నావ్?" అని అడిగాను.

"మేమీ వూర్నించి వెళ్ళిపోతున్నాం బావా!" అని ఆమె అన్నది.

"ఎందుకూ" నాకాదుర్దా కలిగింది.

"మా నాన్నకు బదిలీ అయింది!"

ఆమెతో నా ఫస్టుమార్కు సంగతి చెప్పనే లేదు. అల్లా ఆలోచించుతూ కూచుంటే చీకటి పడేప్పటికి నా కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. "సరే" అన్నాను నేను.

తర్వాత ఆమెను చూళ్ళేదు. ఆరోజున నే నెంత ఏడ్చానో నా వొక్కడికే తెలుసు. నేను మతిలేనివాడిలా ఊరంతా తిరిగాను. మరునాడు రాత్రి ఆశాపూర్వకంగా ఆమె యింటివేపు చూశాను. వెన్నెల మసకగా వున్నది. యిల్లు నిర్మానుష్యంగా ఉన్నది. హే! భగవాన్! ఆ కిటికీ తలుపులు రెండూ కఠోరంగా మూసుకుని ఉన్నాయి.

* * *

ఒక్కొక్కప్పుడు జీవితంలో గతించిన ఘట్టాలన్నీ జ్ఞప్తికొస్తే ఎంత ఆనందంగా ఉంటుంది? అవి జీవితానికి మైలురాళ్ళు. వాటిలో కొన్ని మధురంగా ఉండవచ్చును. కొన్ని విషాదంగా ఉండవచ్చును. మధురమైనా విషాదమైనా కొన్ని గతించిన అనుభవాలు మరుపురానివి. ఆ క్షణాలనే స్మరించుకుని మానవుడు ఒక రకమైన అనుభూతిని పొందుతాడు. దానిలోనే మానవుని సగం ఆనందం యిమిడివున్నది.

కాలం గడిచిపోతున్నది. జీవితం పేజీలు తరగని పెద్దపుస్తకంలాగా, నూతన అనుభవాల్తో, ఆశయాల్తో తరిగిపోతున్నది. ఏనాడైతే కిటికీ తలుపులు మూసుకున్నాయో ఆనాడే సుశీల నా హృదయంలోంచి మాయమైంది. నే నిప్పుడు కిట్టూనిగాను కృష్ణారావుని. నేను కాలేజీలో ప్రవేశించాను. నామాటలు, వేషభాషలు అన్నీ పూర్తిగా మారిపోయినయి. చిన్ననాటి బంధువులు స్నేహితులు నేయింటికి రాగానే కనుక్కోలేక పోయేవాళ్ళు. మా లెక్కల మాష్టారు మాత్రం అప్పుడప్పుడు కూరగాయల మార్కెట్టు ముందు కనిపించి "ఏంరా! కిట్టూ! ఎంత మారిపోయినావురా పిడుగా" అని పరామర్శించేవారు. నే నాయనవేపు చూసి మెల్లిగా నవ్వేవాణ్ణి. ఆయన చాలాసేపు నాతో మాట్లాడేవారు. కుశల ప్రశ్నలైయాక పాపం మద్రాసులో నా సదుపాయాల్ని గురించి తండ్రికంటె ఎక్కువగా అడిగేవారు. అక్కడ హోటలు సరిగ్గా ఉన్నదా, నీళ్ళవసతి బాగావున్నదా, గదిలో దోమలు లేవుగదా, అక్కడివాళ్ళు మనని సరిగ్గా చూస్తారా యిటువంటి ప్రశ్నలన్నీ అడిగి వెళ్ళిపోయేటప్పుడు ఒకచిటికెడు పొడుంఘాటుగా పీల్చి "పోరా! కిట్టూ! బాగా చదువుకో! దూరదేశంలో వున్నానని బెంగపెట్టుకోవాకు!" అని కూరల సంచీ చంక నిరికించుకుని చేతికర్ర వూగించుకుంటూ ఆయన వెళ్ళిపోయేవాడు.

నే నెల్లాగో బియ్యే ప్యాసయి యింటికి తిరిగి వచ్చాను. రాగానే మా బంధువులంతా నా జెబ్బలు విరిచి మాబావ సిఫారసుమీద నెలకు ఓ డెబ్బయి రూపాయిలొచ్చే గుమాస్తాగా ఓ ఆఫీసులో చేర్పించారు. బియ్యే ప్యాసయిన వాడికి గవర్నమెంటువారు, భగవంతుడు కలిసి చూపించే ముక్తికి త్రోవ అదేగదామరి! నే నిప్పుడు మా వూళ్ళోనే ఉన్నాను. విద్యార్థి

జీవితంలో నాయొక్క ఆశయాలన్నీ ఉద్యోగ ధర్మంలో అంతరించిపోయినాయి. నా కెప్పుడూ అనేక ఆలోచనలు కలిగేవి. కాని నేనీసంఘంలో మామూలు మానవుణ్ణి. యీనా జీవితంలో సంస్కారమనేది ఉండదు.

రోజులు గడుస్తున్న కొద్దీ నా ఆలోచనలకు తావు లేకుండా ఆఫీసులో చాలామందిమిత్రులు దొరికారు. అందులోకల్లా ముఖ్యమైనవాడు వెంకట్రావు. అతనెంతో మంచివాడు. నేనంటే అతనికి ప్రాణం. అన్నింటికీ మించి అతను మా పక్కయింట్లోనే ఉండేవాడు. నాకాప్యాయంగా అన్ని సంగతులు చెప్పేవాడు. అతని భార్య అందంగా వుంటుందట! తనని ఎంతో కూర్మితో చూస్తుందిట! తల్లికి కళ్ళుసరిగ్గా కనిపించవుట! చిన్నతమ్ముళ్ళు యిద్దరు స్కూల్లో చదువుకుంటున్నారట.

వెంకట్రావుతో నా జీవితం ఎంతో హాయిగా వెళ్ళిపోయేదే గాని అకారణంగా జరిగిన ఒక చిన్నసంఘటన నా హృదయాన్ని కలియవేసింది. దాంతో నా ప్రవర్తన అంతా తలక్రిందులైంది.

ఒకనాటి రాత్రి వెన్నెల పిండి ఆరబోసినట్టుగా ప్రకాశిస్తున్నది. నా మనస్సునేదో యీనాడు కెలికి వేస్తున్నది. జీవితపథంలో నేను ప్రయాణించిన మైలు రాళ్ళని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఆనాడు డాబాపై కూచుని వున్నాను. రోడ్డుమీద ఎదురుగా కుక్కలు మొరుగుతున్నాయి అప్రయత్నంగా నాకళ్లు చెమ్మగిలినై. నా ప్రయాణంలో మొట్టమొదటి మైలురాయే తిరిగి తిరిగి జ్ఞప్తికిరావడం మొదలుపెట్టింది. ఆమె సుశీల. సుశీల జ్ఞప్తికి రాగానే మూసివున్న ఆ కిటికీ తలుపులవేపు నిస్సారంగా చూస్తుండి పోయాను! ఈ జీవితంలో వాటినింక ఎవ్వరూ తెరవరు. నా దైన్యం అంతా కుక్క మొరుగుల్లోకలసి పోవల్సిందే గాని దానికింక దారిలేదు.

నే నిల్లా అనుకుంటూ వుంటే నా కేదుపు వచ్చింది. నేనా కిటికీవేపు చూస్తూ నిలబడ్డాను.

యింతలో ఆ కిటికీ తలుపులు తెరుచుకున్నై! ఆశ్చర్యం! దీని అర్థం ఏమిటి? అందులోంచి ఒక అందమైన అమ్మాయి ఆ చువ్వల్లోంచి నా వేపే చూస్తూ ఉన్నది!

ఆమె వెంకట్రావు భార్యే అయివుంటుంది. నే నక్కడ నిలవలేక పోయాను. ఆమె వంక చూస్తుంటే ఏమిటో పాపం చేస్తున్నట్టుగావున్నది. ఆమె ఎవరు? ఎందుకు ఆ కిటికీ చువ్వల్లోంచి నా వేపు చూసింది? నా జీవితంలో అనవసరంగా ఆమె దేనికి ప్రవేశించింది?

మర్నాడు వెంకట్రావుతో సాంగత్యం దుర్భరంగా తోచింది. ఆ రోజే మా మేనేజరుగారు భగవంతుడిలాగా అడ్డుపడి ఆఫీసు పనిమీద నన్ను మద్రాసు వెళ్ళి రమ్మన్నారు.

నా సంతోషానికి మేరలేదు. ఈ వెంకట్రావు అందమైన భార్య నాలో రేపిన తుఫానుని పూర్తిగా మరచిపో వచ్చును. యీ ఉద్దేశంతో నేను అమితానందంతో మా అమ్మ దగ్గిరా నాన్నగారి దగ్గిరా శలవు తీసుకుని వెంటనే కూలీచేత బెడ్డింగు మోయించుకుని నదీ తీరం వెంబడే స్టేషన్‌కి ప్రయాణమైనాను. నేను తిరిగొచ్చాక మా అమ్మ చెప్పింది నేను వెళ్ళినప్పట్నించీ ఆమె ఆ కిటికీలోంచి ప్రతిరోజూ డాబామీదకేసి నాకోసం చూశేదిట!

నేను మద్రాసులో నెలా పదిరోజుల్దాకా ఉన్నాను. యిక్కడ పనిలో ఉంటే మా వూళ్లో వాళ్ళందర్నీ మరిచి పోయాను. యింతలోనే నా మధుర స్వప్నాలన్నీ అంతమైనయి. నే నింటికి తిరిగి రావలసి వచ్చింది. నేను రైలు దిగేటప్పటికి మా మానేజరుగారు నన్ను స్టేషను దగ్గర కల్సుకుని నాకు పిడుగులాంటి వార్త చెప్పాడు.

"కృష్ణరావ్! నీతో ఎల్లాచెప్పను?" అంటూ ఆయన ప్రారంభించాడు.

"ఏమయింది?" నేను ఆదుర్దాగా అడిగాను.

"మీ మిత్రుడు వెంకట్రావు. ఇకస్మాత్తుగా"

"ఆ!" అన్నాను.

"మొన్న మరణించాడు!"

నాకేం తోచలేదు. ఈ వార్త నాకే శనిఘాతంలాగా తగిలింది. మా మేనేజరుతో కలిసి నేను నడచి వస్తున్నాను. నది యీవాళ వుత్సాహంగా వున్నది అది ఈనాడు జోరుగా ప్రవహిస్తున్నది. నేనూ వెంకట్రావు యీ నదీ తీరంమీద గడిపిన సాయంత్రాలు గుర్తురాగానే నా కళ్లంబడి నీళ్లు తిరిగాయి.

యిప్పుడేమిటి నా కర్తవ్యం ? యీ ప్రశ్నకు నాకు సమాధానం దొరకలేదు. పాపం ! అతని భార్యని తలచుకుంటే నా దేహం కంపిస్తున్నది. ఎంత ఏడుస్తున్నదో? ఆమె మీద కోపం అంతా యీ సంఘటనతో వాత్సల్యరూపంగా ఆమె మీద ప్రసరించింది. భగవంతుడున్నా లేక పోయినా, అనాథలు యింత త్వరలో సృష్టించ బడతారని నాకంత వరకూ తెలియదు.

నేనా యింట్లో అడుగు పెట్టడం అదే మొదటిసారి ! కాని ఆ యింట్లో నివసించిన యిద్దరు వ్యక్తులకు నా హృదయం అర్పించాను. ఒకటి నా చిన్ననాటి సుశీల. రెండవది వెంకట్రావు. వారిద్దరూ యీ యింట్లో లేరిప్పుడు!

మొట్టమొదట వెంకట్రావు తల్లి కనిపించింది. ఆమె నన్ను తికష్టంమీద గుర్తుపట్టి 'వచ్చావా నాయనా' అని భోరున ఏడ్చింది. ఆమె దగ్గిర ఎంతోసేపు నే ఉండలేదు. నా కళ్లు రెండూ హిందూ సంఘం అంతా సానుభూతి చూపవలసిన వెంకట్రావు భార్యకోసం వెతుకుతున్నాయి.

నేను లోపలికి వెళ్ళాను. కాని ఆమెతో ఎల్లా మాట్లాడ్డం? ఆమె కెల్లా నా హృదయం అంతా విప్పుకుని సానుభూతి తెల్పడం? ఆమె నెల్లా యీ విషాదం నుండి రక్షించడం?

నే ననుకున్నట్లుగానే ఆమె ఏడుస్తున్నది. నన్ను చూడగానే ఆమె లేచి నుంచుని దగ్గిరగా రమ్మని సంజ్ఞ చేసింది. నే నాశ్చర్య పోయాను! ఆమెను ఎన్నోవిధాల ఓదార్చాను. కాని నా మాట లామె లెక్కచేసినట్లులేదు. ఆమె నా వేపు చూస్తున్నది. మెల్లిగా మందహాసం చేస్తున్నది. ఆమెను చూస్తున్నకొద్దీ నాలో ఒకవిధమైన పవిత్రమైన బాధ్యత కల్గుతున్నది.

ఆ రోజల్లా బాధపడ్తూనే వున్నాను. ఆమె ఎవరు? ఎందుకలా నా వేపు చూస్తున్నది? ఎందుకంత ఆప్యాయంగా పల్కరిస్తుంది? ఆ ఏడుపులో ఏదో ఉద్వేగం నాహృదయాన్ని చీల్చివేస్తున్నది. ఎవరీమె? యీమెను నేనే జన్మలో చూశాను!

తల ఎత్తి ఆమె నా కళ్ళల్లోకి చూసింది. ఆ మొహం నాకు పరిచితమే. ఆ మొహంలో ఏదో మాధుర్యం ఉన్నది.

"నన్నప్పుడే మరిచిపోయావా, బావా??" అని ఆమె అన్నది.

'ఎవరది ?' నేనా కళ్ళల్లోకి సూటిగా చూశాను. నా మొదటి మైలురాయి మెరుపులా జ్ఞాపకం వచ్చింది. ఆమె కన్నీట చెరగుతో తుడుచుకుంటూ.

"నేను సుశీలని!" అన్నది.

ఆమెను తేరిపార చూశాను. నాకళ్లల్లో ఏనాడో ఆరిపోయిన జ్యోతి మళ్లీ వెలిగింది. ఆమె ఎంత మారిపోయింది ! ఎంత అందంగా వున్నది? ఇంకెందుకూ ఆఅందం ? నా చిన్ననాటి సుశీల యిప్పుడు విధవైందా ? భగవంతుడా ? ఆమెను రక్షించు! "అయ్యో నువ్వు నా సుశీలవేనా?" నేనన్నాను. "నువ్వేనా ఆ కిటికీలోంచి చూసింది ?"

"నేనే బావా ! ఆ కిటికీలోంచి నేను తప్ప నీవేపు అల్లా ఎవరు చూస్తారు చెప్పు ?" అని ఆమె అన్నది.

నేను సుశీలవేపు చూశాను. ఆమెచూపుల్లో మా చిన్ననాటి ఆటలు మెరిసినై.

"బావా ! నాకేం విచారం లేదు." ఆమె ప్రారంభించింది.

"ఈ జీవితం అంతా యీ వైధవ్యంతోనే గడుపుతాను. నాకోసం విచారించకు. పోయిం దేమున్నది ? నాకు జ్ఞానం ఉన్నది కదా ! నేను సంఘాన్ని తిరస్కరించి మన సనాతన సాంప్రదాయాలన్నీ మట్టిపాలు చేయటంలేదు. ఇన్ని యుగాలు వచ్చిన ప్రాచీన సాంప్రదాయం నా ఒక్కతెలోనూ ఏమీ కొత్తనష్టం తీసుకురాకూడదు. ఏసంఘమైతే నన్నీ విధంగా బతకమని శాసించిందో, ఆ సంఘానికే నేను సేవచేస్తాను. దానికే నేను ప్రత్యుపకారం చేస్తాను. దాన్నే నా హృదయం అర్థం చేసుకోమని ప్రార్థిస్తాను!"

ఆమె కళ్ళనీళ్లు తుడుచ్చుకున్నది.

"సుశీలా! నీవింత దీనురాలివై పోతావని నే నెన్నడూ అనుకోలేదు!"

ఆమె నవ్వింది. నాకన్న చిన్నదైనా అనుభవంలో ఆమె నాకన్న పెద్దదే గదా !

"నే ననుకున్నాను! ఏనాడైతే చిన్నప్పుడు నిన్ను చాలా దెబ్బలు కొట్టానో ఆనాడే నే ననుకున్నాను. నీ వన్నావు "సుశీలా! ఇన్ని

దెబ్బలతో ట్టినందుకు ఏనాడో దేవుడునిన్ను దండి స్తాడు!" అని. దేవుడు నన్ను దండించాడు బావా! నన్నాయన వదలలేదు!"

నే నామెవేపు విషాదంగా చూశాను.

"సుశీలా! నే ప్రాయశ్చిత్తం చేసుకొనాలనే నేను నీ దగ్గరకి వచ్చాను!"

"బావా... నే నప్పుడే నిశ్చయించుకున్నాను. నేను పోతున్నాను పుట్టింటికి!"

ఎక్కడో ఉన్న ఆమె పుట్టింటికి పోతే ఇక నేను ఆమెను చూళ్ళేను.

ఇంతలో వెంకట్రావు చిన్నతమ్ముడు వచ్చి నాకు నమస్కరించాడు.

"సరే బావా! నా పేరు జ్ఞాపకం ఉంచుకో! ఈ జీవితంలో నే నిక కనిపించను!" ఇల్లా అని ఆమె ఆక్రందించి లేచి వెంకట్రావు తమ్ముల్తో యింట్లోకి వెళ్ళిపోయింది.

"భగవంతుడు నిన్ను తప్పక రక్షిస్తాడు!" అన్నమాటల్ని ఆమె వినిపించుకోలేదు. నేన క్కడే దిగ్భ్రమచెంది కూలబడ్డాను. నాలో రక్తం ఆగిపోయింది. యీ జీవితంలో నాకు మాధుర్యమంటే ఏమిటో తెలియనీకుండా ఆమె వెళ్ళిపోయింది.

తర్వాత సుశీల సంగతి మెల్లగా మర్చిపోదా మని ప్రయత్నించాను. నేను మామూలుగా ఆఫీసుకుంచి రావడం-పోవడం తప్ప వెంకట్రా వుని సుశీలను గురించి తలపెట్టలేదు. ఒకరోజు ఉదయం నే ఆఫీసుకుబయల్దేరుతోంటే పక్క యింటిలో ఏడుపులు వినిపించాయి. వాళ్ళబ్బా యిక్కడి దగ్గరికెళ్ళి సంగతేమిటని అడిగాను.

అందుకు వాడు పిడివేపు చెయ్యి కిటికీ వేలెత్తి చూపించి "ఆ కిటికీ కనబడుతున్నది చూశారా?" అన్నాడు. ఆ కిటికీ కేసి నేను వెర్రిదానిలాగ చూశాను. "ఆ కిటికీ దగ్గర నోటితో మూసె యిద్దరని అమ్మగారి అక్క అంటుంది." అన్నాడు వాడు.

"ఎందుకో?" అన్నాను నేను.

"ఎందుకో మాకూ తెలియదు. యీ కిటికీ వాళ్ళకు అచ్చిరాలేదట." అని వాడు ఏడు ప్రారంభించాడు.

నేను నవ్వడానికి ప్రయత్నించి "అలా నా, అంతే అయిపోయిందితే!" అని ఇంకొక్క [illegible] వాళ్ళతో మా ఆఫీసువేపు త్వరగా నడక సాగించాను.



శ్రీ ఘంటసాలవారి "లక్ష్మమ్మ"లో నాయిక భూమిక ధరించిన అభినేత్రి కృష్ణవేణి